గండ్లు పూడ్చేదెన్నడో..!

- వరదలకు పెదకాకాని చెరువుకు రెండుచోట్ల గండ్లు
- మంచినీటి చెరువులో కలుస్తున్న మురుగు నీరు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- వాకింగ్ ట్రాక్ సైతం దెబ్బతిని సీనియర్ సిటిజన్‌లకు ఇబ్బందులు


మంచినీటి చెరువుకు పడిన గండి

పెదకాకాని: వరదలకు మంచినీటి చెరువు కట్టలు దెబ్బతిన్నప్పటికీ మరమ్మతులకు నోచుకోవడం లేదు. పెదకాకాని మంచినీటి చెరువు కట్టకు ఆగస్టు నెలలో తుఫాన్, వరదల ప్రభావంతో మూడు చోట్ల గండ్లు పడ్డాయి. వర్షపు నీరు పెద్దఎత్తున చేరడంతో మంచినీటి చెరువుకు రెండు వైపులా ఉన్న మురుగునీటి చెరువుల నీరు మొత్తం కలసి పోయాయి. ఆ నీటినే రెండు నెలలుగా ఫిల్టర్ చేసి గ్రామంలో సరఫరా చేస్తున్నారు. మండల కేంద్రమైన పెదకాకాని గ్రామంలో సుమారు 30 వేల మంది జనాభా నివశిస్తున్నారు. గ్రామంలోని ఏర్పాటు చేసిన మంచినీటి చెరువుకు గుంటూరు ఛానల్(కొత్తకాలువ) నుంచి నీరు సరఫరా చేసి నింపడం, ఆ నీటిని చెరువు నుంచి ఫిల్టర్ బెడ్‌లకు పంపింగ్ చేసి అలా ఫిల్టర్ అయిన నీటిని గ్రామంలో సరఫరా చేస్తుంటారు. రెండు నెలలుగా చెరువుకు చేరిన మురుగునీటినే ఫిల్టర్ బెడ్‌ల ద్వారా ఫిల్టర్ చేసి గ్రామంలో సరఫరా చేస్తున్నారు.

మంచినీటి చెరువులో కలుస్తున్న మురుగు..

గ్రామంలో నిర్మించిన నాలుగు వాటర్ ట్యాంక్‌ల నుంచి 4 వేల కుళాయి కనెక్షన్‌లు, 150 పబ్లిక్ కుళాయిల ద్వారా ప్రజలు తాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు మంచినీటి చెరువులో రెండు మురుగు నీటి చెరువుల నీరు కలిసినప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. మంచినీటి చెరువు కట్టకు గండ్లు పూడ్చకపోవడంతో కురుస్తున్న వర్షాలకు మురుగునీటి చెరువులు నిండి ఆ వ్యర్థాలతో కలుషితమైన నీరు మంచినీటి చెరువులో కలసే ప్రమాదం ఉంది. చెరువుకు రెండు వైపులా గేటు ఏర్పాటు చేయడం, చెరువు కట్ట కోతకు గురికావడంతో చెరువుకట్టపై మేత మేసేందుకు పశువులు కూడా వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


అధ్వానంగా మారిన వాకింగ్ ట్రాక్


ఫెన్సింగ్ ఊడిపోయిన దృశ్యం

దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్..

పెదకాకాని గ్రామ ప్రజలు వాకింగ్, వ్యాయామం చేసుకునేందుకు అనుకూలంగా రాజ్యసభ సభ్యుడు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి ఎంపీ నిధులు రూ.92 లక్షల వెచ్చించి మంచినీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించారు. వాకింగ్ ట్రాక్‌లో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాక్ పొడవునా మొక్కలు నాటించడంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో గ్రామ ప్రజలు వాకింగ్, వ్యాయామం చేసుకుంటున్నారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్‌లు ఉదయం, సాయంత్రం మంచినీటి చెరువు కట్ట(వాకింగ్‌ట్రాక్)పై వాకింగ్ చేస్తున్నారు. చెరువులోనికి గేదెలు దిగకుండా చెరువు చుట్టూ ఫెన్సింగ్ కూడా వేయించడం జరిగింది. అయితే చెరువు కట్ట దెబ్బతినడం, రెండు నెలలుగా మరమ్మతులు చేయకపోవడంతో వాకింగ్ ట్రాక్ సైతం దెబ్బతినింది. త్వరితగతిన దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

హెచ్‌ఎంలకు టీచ్ టూల్‌పై అవగాహన



పొన్నూరు: పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం పాఠశాలల హెచ్ ఎంలకు టీచ్ టూల్ అబ్జర్వేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాసరెడ్డి సభకు అధ్యక్షత వహించారు. ఎంఈఓ ఏ.వి.హెచ్ ప్రసాద్ టీచ్ టూల్ ప్రక్రియను వివరించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధనా విధానాన్ని గమనించాలని తెలిపారు. తరగతులలో గమనించిన అంశాలను ఫర్ కిడ్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలి



పొన్నూరు: మండలంలోని చౌక దుకాణాల డీలర్లు, ఎండీయూ వాహనాల ఆపరేటర్లు సమయపాలన పాటించి రేషన్ బియ్యం కార్డు దారులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ జియా వుల్ హక్ అన్నారు. అక్రమాలకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో చౌక దుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో నిత్యావసర సరుకుల పంపిణీపై సమావేశం నిర్వహించారు. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 18 వరకు వందశాతం పంపిణీ పూర్తి చేయాలన్నారు. అలాగే పంపిణీలో బియ్యం, పామాయిల్, కందిపప్పు ఇతర నిత్యావసర సరుకులు పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుని దుకాణ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కందిపప్పు, జొన్నలు కూడా నవంబరు నుంచి పంపిణీ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో డీటీలు వెంకట్రావు, రమేష్ పాల్గొన్నారు.

చలపతిలో 'టెక్ నిర్వాణ టెక్‌ఫెస్ట్'



గుంటూరు రూరల్: విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక నైపుణ్యాలను మెరుగు పరుచుకుంటూ అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో టెక్ నిర్వాణ టెక్ ఫెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్ ఫెస్ట్‌లో విద్యార్థులు కోడ్ క్రాఫ్ట్ చాలెంజ్, ఇన్నోవేషన్ షోకేజ్, మైండ్ బైట్స్, టెక్నోస్ట్రోమ్ తదితర పోటీలలో పాల్గొన్నారన్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ కళాశాలలకు చెందిన 350 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి ఫెస్ట్‌లు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎ.బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్ క్లీనింగ్ సామగ్రి అందజేత

కాకుమాను: విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యం ఎంతో ముఖ్యమని విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్స్‌ను అందజేశారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాఠశాలల్లోని టాయిలెట్‌లను ప్రతి రోజు క్లీనింగ్‌కు నియమించిన వారిచే శుభ్రం చేయించాలని ఆయన సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత పాఠశాలల సిబ్బంది దేనని ఆయన తెలిపారు.ఈసందర్భంగా హెచ్ ఎంలకు క్లీనింగ్ మెటీరియల్స్‌ను అందజేశారు. ఎంఈఓ-2 కె.విజయ్ భాస్కర్ ఉన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్‌ను నిరోధించవచ్చు

మెడికల్ క్యాంపులో డాక్టర్ షమ సుల్తానా

గుంటూరు మెడికల్: స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్‌ను నిరోధించవచ్చని హోప్‌విన్ హాస్పటల్స్ చైర్‌పర్సన్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. అక్టోబర్ క్యాన్సర్ అవగాహన మాసోత్సవం సందర్భంగా హోప్ విన్ హాస్పిటల్, ఒమేగా హాస్పటల్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గుంటూరు నగరంలోని బారా ఇమామ్ పంజా సెంటర్‌లో ఉన్న హోప్ విన్ హాస్పిటల్ ఓపీడీ క్లినిక్‌లో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ క్యాంపులో డాక్టర్ షమ సుల్తానా సుమారు 100 మంది రోగులకు బీపీ, బ్లడ్ షుగర్ టెస్ట్, పాప్ స్మియర్, మామోగ్రఫీ తదితర పరీక్షలు ఉచితంగా చేశారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయరూ..!

పొన్నూరు: పట్టణ ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ఇటీవల రహదారి విస్తరణ అనంతరం బీటీ రోడ్డు నిర్మించారు. ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని స్పీడ్ బ్రేకర్లు వేయడం మరిచారు. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారిలో ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు జరిగాయి. ట్రావెల్ బస్సు డివైడర్‌ను ఢీకొన్న సంఘటన గతంలో చోటు చేసుకుంది. గురువారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట లారీ, బైక్‌ను ఢీకొన్న సంఘటనలో ప్రమాదం తప్పింది. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రధాన రహదారిలో ప్రమాద ఘటన

వీవీఐటీలో 'అమేయా 2కే24'

పెదకాకాని: విద్యార్థులు సాంకేతిక సదస్సులలో పాల్గొనడం ద్వారా పోటీతత్వం, అధునాతన సాంకేతిక విధానాలు అలవడతాయని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఎండీ, సీఈఓ కస్టమ్స్ జీఎస్టీ కమిషనర్ ఎం.రమణారెడ్డి అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలలో అసోసియేషన్ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 24, 25 తేదీలలో జరిగే జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు అమేయా 2కే24 వేడుకలను ఎం.రమణారెడ్డి, జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ప్రెసిడెంట్ ఎంవీ చారిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.రమణారెడ్డి మాట్లాడుతూ సాంకేతిక సదస్సులలో పాల్గొనడం ద్వారా పోటీతత్వం, అధునాతన సాంకేతిక విధానాలు అలవడతాయన్నారు. సాంకేతిక సదస్సులో విజేతలుగా నిలవడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలను దక్కించుకోవచ్చన్నారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టు విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. ఎంవి చారి మాట్లాడుతూ విద్యార్థులు వాస్తవికతకు దగ్గరగా ఉంటూ సాంకేతిక మార్పులను గమనిస్తూ ఉండాలన్నారు. రెండు రోజుల పాటు జరుగుతున్న ఈ సదస్సులో జరిగే ఈ సదస్సులో టెక్ హంట్, పోస్టర్ ప్రజెంటేషన్ యాడ్స్, కాంపొనెంట్ క్లాష్ వంటి సాంకేతిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు వివిధ సాంకేతిక కళాశాలల నుంచి 1100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు సంధానకర్త వి.కిరణ్‌కుమార్, విద్యార్థి విభాగం సభ్యులు జి.సాయిగణేష్, ఎ.సిద్ధార్థ పాల్గొన్నారు.


జీఎస్టీ కమిషనర్ ఎం.రమణారెడ్డి, ఎంవీ చారి, ఇతర అతిథులతో మెకానికల్ విద్యార్థులు

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

గుంటూరు రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని సుమారు 70-75 సంవత్సరాల వయసుగల వృద్ధుడు బుడంపాడు గ్రామం వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడనే సమాచారం మేరకు సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని 108 ద్వారా చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించామన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామని, మృతుని ఆచూకీ తెలిసినవారు నేరుగా నల్లపాడు పోలీస్ స్టేషన్‌లోగానీ, 8688831376 సెల్ నంబర్‌నుగానీ సంప్రదించాలన్నారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నాణ్యమైన ఆహారం అందించాలి

- న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి టి.లీలావతి
- సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో తనిఖీలు

నగరంపాలెం: విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు, వారిని జాగ్రత్తగా చూసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి టి.లీలావతి అన్నారు. ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు గుంటూరు నగరంలో నిర్వహిస్తోన్న ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలలో గురువారం తనిఖీలు నిర్వహించారు. రాజాగారితోట ఒకటో వీధి, శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరం రోడ్డు, ఏసీ కళాశాల ఎదురు, స్టాల్ బాలికల ఉన్న పాఠశాల ఆవరణలో, జూట్‌మిల్లు ఎదురు నెలకొన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

విద్య , వైద్యం, ఇతర మౌలిక సదుపాయాలపై బాలికలతో మాట్లాడారు. సదుపాయాల్లో ఏవైనా లోపాలు ఉన్నట్లయితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లేదా నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హెల్ప్‌లైన్ నంబర్ 15100కు సమాచారం అందించాలని సూచించారు.


వంటగదిని పరిశీలిస్తున్న కార్యదర్శి లీలావతి

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చేబ్రోలు: చేబ్రోలు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం జరుగుతుందని ఎంపీడీఓ కె.లలిత గురువారం తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి అధ్యక్షతన జరిగే సమావేశంలో వివిధ అంశాలపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల పై సమీక్ష ఇతర అంశాల గురించి చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీఓ తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

గుంటూరు రూరల్: అప్పుల బాధ, కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం అడవి తక్కెళ్ళపాడు రాజీవ్ గృహకల్ప టిడ్కో గృహాల్లో నివశించే గోకుల శ్రీనాథ్ (32) గతంలో కొరియర్ బాయ్‌గా పనిచేసేవాడు. ఆతనికి భార్య పిల్లలున్నారు. ఈ క్రమంలో అధికంగా అప్పులు అవడంతో ఉద్యోగం మానేశాడు. ప్రస్తుతం కాళీగానే ఉంటున్నాడు. ఈ క్రమంలో అప్పులు ఎక్కువై, దానికి తోడు కుటుంబ కలహాలతో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం నుంచి ఇంటి తలుపులు తీయకపోవటంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి మృతుని అన్న కోటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అమృత్ పథకంలో ఉచితంగా కుళాయి కనెక్షన్లు

నెహ్రూనగర్: అమృత్ పథకంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచితంగా కుళాయి కనెక్షన్ అందిస్తామని, అర్హులైన వారు స్థానిక వార్డ్ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డ్ కలిగి, ఏడాదికి రూ.5 వందలలోపు ఆస్తి పన్ను కలిగిన వారి నివాసాలకు ఉచిత కుళాయి కనెక్షన్ ఇస్తామని తెలిపారు.

అస్తవ్యస్త డ్రెయిన్లతో అవస్థలు


నిడుబ్రోలు 8వ వార్డులో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు


నిడుబ్రోలులో ఒక రహదారి దుస్థితి

పొన్నూరు: పట్టణంలో ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ శాఖ మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. పలు ప్రాంతాల్లో డ్రెయిన్లు అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువగా కచ్చా కాలువలే ఉండటంతో చిన్నపాటి వర్షానికే మురుగు నేరుగా వీధుల్లోకి చేరుతోంది. మున్సిపల్ అధికారులు ప్రణాళికలు వేయడం తప్ప పనులు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. నిడుబ్రోలు 8 వార్డులో వేబ్రిడ్జి ఎదురు వీధిలో డ్రెయిన్ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువల్లో నీరు ముందుకు కదలక స్తంభించి రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు విజృంభించి రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నా, అధికారులకు మాత్రం పట్టడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విజ్ఞాన్ ఇండస్ట్రియల్ డైరక్టర్‌కు డ్రోన్ హ్యాకథాన్ అవార్డు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఇండస్ట్రియల్ డైరక్టర్‌గా సేవలందిస్తున్న ప్రసాద్ పొండాకు డ్రోన్ హ్యాకథాన్‌లో అవార్డు లభించినట్లు వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ వారు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్స్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'అమరావతి డ్రోన్ సమ్మిట్-2024'లో తమ వర్సిటీకు చెందిన ఇండస్ట్రియల్ డైరక్టర్ ప్రసాద్ పొండాకు డ్రోన్ హ్యాకథాన్‌లో మూడవ బహుమతి అందుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీద అవార్డుతో పాటు రూ.50 వేల నగదు బహుమతిని అందుకున్నట్లు తెలియజేసారు. బహుమతి సాధించిన ప్రసాద్ పొండాను చైర్మన్ లావు రత్తయ్య తదితరులు అభినందించారు.


ప్రసాద్ పొండాకు బహుమతిని అందజేస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

లోతట్టు ప్రాంతాల్లో నీటిని తొలగించాలి

పొన్నూరు: వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నిల్వ చేరిన నీటిని వెంటనే తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. గురువారం నిడుబ్రోలులోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి పలు సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. రక్షిత మంచినీటి సరఫరాను పరిశీలించి, మంచినీటి యొక్క నాణ్యతను పరీక్షించారు. పట్టణ ప్రజలకు సురక్షితమైన నీటి సరఫరా జరగాలని సిబ్బందికి తెలిపారు. డంపింగ్ యార్డ్ సందర్శించి తడి, పొడి చెత్త సేకరణ కేంద్రాలను పరిశీలించారు. చెత్త, వ్యర్థాలు రోడ్డుపైకి రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


నిల్వ చేరిన నీటిని పరిశీలిస్తున్న కమిషనర్

పంటల సంరక్షణే నాట్కో ధ్యేయం

పెదకాకాని: రైతులు పండించే పంటల సంరక్షణే ధ్యేయంగా నాట్కో కంపెనీ కొత్త ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకు రావడం జరిగిందని నాట్కో ఇండియా 1 హెడ్ ఎస్.నర్సయ్య అన్నారు. మండలంలోని వెనిగండ్ల గ్రామంలో బుధవారం రాత్రి రైతులకు క్రిమిసంహారక మందులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతలో రాజీ పడకుండా అందుబాటు ధరల్లో నాట్కో వారి ఉత్పత్తులు మార్కెట్‌లో లభిస్తున్నాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా రైతులతో కలసి నాట్కోవారి నూతన క్రిమిసంహారక మందు గ్లాంజ్ ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సేల్స్ హెడ్ డాక్టర్ జి.అజయ్‌రెడ్డి, ఏరియా మేనేజర్ సీహెచ్ ప్రభాకరరావు, వీరాంజనేయ ట్రేడర్ అధినేత వెంకట్రావు, కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.


రైతులతో కలసి నాట్కో నూతన క్రిమిసంహారక మందును లాంచ్ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

మహిళల రక్షణకు కఠిన నిర్ణయాలు తీసుకోవాలి

పెదకాకాని: ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించేందుకు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. రౌడీషీటర్ నవీన్ చేతిలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించిన సహానాకు న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ గురువారం పెదకాకాని సీఐటీయూ ఆధ్వర్యంలో సుందరయ్య కాలనీలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నన్నపనేని శివాజీ మాట్లాడుతూ మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. మహిళలకు, బాలికలకు రక్షణ లేకుండా పోతుందని, ప్రభుత్వం రక్షణ కల్పించేందుకు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. చికిత్స పొందుతూ చనిపోయిన సహానా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, నిందితుణ్ణి కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం కమిటీ సభ్యులు బురదగుంట సాంబయ్య బేతపూడి బాబురావు, ఆముదాల నాగేశ్వరరావు, ఎం.వెంకాయమ్మ, కె.లక్ష్మి, జెట్టి రాజలక్ష్మి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


నిందితుణ్ణి కఠినంగా శిక్షించాలని కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న నన్నపనేని శివాజీ, నాయకులు

ఇంటి తలుపులు పగులగొట్టి నగదు చోరీ

పెదకాకాని: తాళాలు వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి రూ.50వేలు చోరీ చేసిన సంఘటన ఉప్పలపాడు గ్రామంలో చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన ద్రోణాదుల మల్లేశ్వరి బుధవారం రాత్రి గ్రామంలోనే ఉంటున్న కుమార్తె ఇంటికి నిద్రించేందుకు వెళ్ళింది. దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువా తాళాలు పగులగొట్టారు. బీరువాలో దాచిన రూ.50వేలు నగదు దోచుకుని పరారీ అయ్యారు. గురువారం ఉదయం కుమార్తె ఇంటి నుంచి తన ఇంటికి వెళ్ళిన మల్లేశ్వరి ఇంటి తలుపులు, బీరువా తలుపులు తెరచి ఉండటంతో దొంగలు పడినట్లు గుర్తించి పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలానికి పెదకాకాని పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.


బీరువా తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన దొంగలు

సత్తాచాటిన క్రీడాకారులకు అభినందనలు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో గుంటూరు జిల్లాలోని జెడ్పీ హైస్కూళ్లలో చదువుతున్న బాల, బాలికలు రాష్ట్రస్థాయిలో సత్తా చాటి, జాతీయస్థాయికి ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అన్నారు. హిందూపురంలో ఈనెల 21,22,23వ తేదీల్లో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల టీం ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, బాలుర టీం ద్వితీయస్థానంలో నిలిచిన సందర్భంగా గురువారం జెడ్పీ ఆవరణలోని క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులను ఆమె అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో పోటీతత్వంతో ముందుకెళ్లి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. జెడ్పీ పాఠశాలల విద్యార్థులను చదువుతో పాటు క్రీడల దిశగా ప్రోత్సహించడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి నిదర్శనంగానే ఈ విజయాన్ని అందుకున్నారని అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మెల్లంపూడి రవి, గుంటూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు చంద్ర వినయ్‌కుమార్, టీం కోచ్ మేనేజర్‌లు తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.